క్లుప్తంగా

గుర్తు తెలియని ప్రయాణికుడి మృతి



తెనాలి రూరల్: రైలు నుంచి జారిపడి తీవ్ర గాయాలపాలైన ప్రయాణికుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఢిల్లీ–త్రివేండ్రం కేరళ ఎక్స్‌ప్రెస్‌లో ఈ నెల 27వ తేదీ రాత్రి ప్రయాణిస్తున్న సుమారు 30 నుండి 35 ఏళ్ల మధ్య వయసున్న వ్యక్తి చిలువూరు రైల్వేస్టేషనులో రైలు నుంచి ప్లాట్‌ఫాంపై జారిపడి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. తొలుత స్టేషను సిబ్బంది 108లో తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు పంపారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం గుంటూరు వైద్యశాలకు పంపారు. అక్కడే చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు జీఆర్పీ ఎస్‌ఐ జి. వెంకటాద్రి తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9440627554 నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

నేడు డయల్ యువర్ డిపో మేనేజర్

నెహ్రూనగర్: గుంటూరు 2 డిపో పరిధిలో సోమవారం డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ షేక్ అబ్దుల్ సలామ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డిపో మేనేజర్ కార్యాలయంలో గుంటూరు– హైదరాబాద్, గుంటూరు– తెనాలి, గుంటూరు– విజయవాడ, గుంటూరు – విశాఖపట్నం రూట్లలో తిరుగుతున్న బస్సులు,సిబ్బంది తీరు గురించి ప్రయాణికులు, విద్యార్థినులు 9959225421 నంబర్‌కు ఫోన్ చేసి సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు.

రేపటి నుంచి పట్టభద్రుల ఓటు నమోదు

నెహ్రూనగర్: గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదు వైఎస్సార్‌సీపీ గుంటూరు తూర్పు మాజీ ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా క్యాంపు కార్యాలయం వద్ద జరుగుతుందని ఆ పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా ఆదివారం తెలిపారు. అక్టోబర్ 1వ తేదీ నుంచి నవంబర్ 1వ తేదీ వరకు మంగళదాస్‌నగర్ 3వ లైనులోని మాజీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పట్టభద్రుల ఓటు నమోదు ప్రక్రియ జరుగుతుందని ఆమె చెప్పారు.

మతిస్థిమితం లేని యువకుడి అదృశ్యం

లక్ష్మీపురం: మతిస్థిమితం లేని యువకుడి అదృశ్యంపై నగరంపాలెం పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. వివరాలు.. డీఎస్ నగర్ 1వ లైన్ ప్రాంతానికి చెందిన గుర్రపుశాల సుందరరావుకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు పవన్‌కుమార్ మతిస్థిమితం లేక చికిత్స పొందుతున్నాడు. అయితే ఈనెల 15వ తేదీన నగరంపాలెంలోని చర్చికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో తమ్ముడు అనిల్‌కుమార్ లాలాపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా దారి తప్పిపోయిన పరిధి నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో వస్తుందని చెప్పడంతో తిరిగి నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా తప్పిపోయిన కేసు నమోదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు నగరంపాలెం పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ సలాం 8688831340కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

తప్పిపోయిన వృద్ధుడు...

వృద్ధాప్యంలో ఉన్న ఓ మతి స్థితిమితం లేని వ్యక్తి రాత్రి సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాక పోవడంతో కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నగరంపాలెం పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. వివరాలు.. అంకమ్మనగర్ 1వ లైన్ ప్రాంతానికి చెందిన చిట్టిరాల వెంకయ్య (64)గత కొంత కాలంగా మతి స్థిమితం లేక చికిత్స పొందుతూ ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఈనెల 28 శనివారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల పరిశీలించినా కనిపించక పోవడంతో వృద్ధుడు వెంకయ్య కుమారుడు సుధాకర్ ఫిర్యాదు మేరకు నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఆచూకి తెలిసిన వారు నగరంపాలెం పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ సలాం 868883 1340కు సమాచారం ఇవ్వాల్సిందిగా కోరారు.

అలరించిన మహతీ స్వర సుధ సినీ సౌరభాలు

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై ఆదివారం సాయంత్రం సినీ సౌరభాల కార్యక్రమం నిర్వహించారు. మహతి స్వరసుధ వ్యవస్థాపక అధ్యక్షురాలు పత్రీ నిర్మల ఆధ్వర్యంలో జరగ్గా, ఆలయ పాలక మండలి సహాయ కార్యదర్శి వూటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. గాయని, గాయకులు రాజ్యలక్ష్మి, అన్నపూర్ణ, ముకుంద ప్రియ, లక్ష్మి, కృష్ణ, నాగవల్లి, విజయశ్రీ, ప్రద్యుమ్న, వీరయ్య, సాయిబాబా, ఈశ్వరరావు తదితరులు అలనాటి సినీ సౌరభాలను వీనుల విందుగా ఆలపించారు. కీబోర్డ్‌పై ప్రసాద్, తబలాపై వెంకట్, పాడ్స్‌పై ప్రసాద్ వాయిద్యాన్ని అందించారు. కార్యక్రమంలో కృష్ణప్రసాద్ వ్యాఖ్యానం చేయగా, కె.మదన్ మోహనరావు పాల్గొన్నారు.

ప్రజల సమస్యల్ని తక్షణం పరిష్కరించండి

- మున్సిపల్ కమిషనర్‌కు మంత్రి మనోహర్ ఆదేశం
- పలు వార్డుల్లో పర్యటన



జంపని డ్రెయిన్ వద్ద మహిళతో మాట్లాడుతున్న మంత్రి మనోహర్

తెనాలి రూరల్: ప్రజల సమస్యల్ని తక్షణం పరిష్కరించాలని మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశించారు.ఆయన ఆదివారం సాయంత్రం పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించారు. నాజరుపేటలో ప్రజలతో మాట్లాడారు. జంపని డ్రెయిన్‌ను పరిశీలించారు. కాల్వ వెంబడి నివసిస్తున్న స్థానికులతో మాట్లాడి, వారి సమస్యలు తెలుసుకున్నారు. మున్సిపల్ కమిషనర్ బండి శేషన్నతో వాటిని నమోదు చేయించి, పరిష్కరించాలని ఆదేశించారు. ఆయన వెంట జనసేన నాయకులు గాదె వెంకటేశ్వరరావు, హరిదాసు గౌరీశంకర్, బండారు రవికాంత్, మామిడిబత్తుల సుబ్రహ్మణ్యం, మాజీ కౌన్సిలర్ కటకం శాంత కుమారి ఉన్నారు. అనంతరం రామలింగేశ్వరపేట పుట్టారాఘవయ్య రైస్ మిల్ వద్ద రామాలయంలో ఎనిమిది నుంచి 13 వార్డులలోని జనసేన పార్టీ ముఖ్య నాయకులలు, కార్యకర్తలతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. గతంలో ప్రారంభించిన పనులు పూర్తి చేయాల్సి ఉందని, అందరం కలసికట్టుగా తెనాలిని అభివృద్ధి చేసుకుందామని మంత్రి మనోహర్ నాయకులకు సూచించారు. సమావేశంలో జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ముందుగా ఆలయంలో రాముల వారిని దర్శించుకున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

తెనాలి మండలంలోని చావావారిపాలెం గ్రామానికి చెందిన బొద్దు కిరణ్‌బాబు కొంతకాలంగా ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్నాడు. పేద కుటుంబానికి చెందిన అతడి కుటుంబ సభ్యులు పలు వైద్యశాలల్లో చికిత్స చేయించినా, శస్త్ర చికిత్స చేయాల్సిన అవసరం ఏర్పడింది. ఇది హైదరాబాద్‌లో కూడా అందుబాటులో లేకపోవడంతో బెంగుళూరులో చేయాల్సి వచ్చింది. ఇందుకోసం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ. ఆరు లక్షల చెక్కును మంత్రి నాదెండ్ల మనోహర్ తెనాలిలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఉదయం జరిగిన కార్యక్రమంలో కిరణ్ బాబు కుటుంబ సభ్యులకు అందజేసి, ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ క్లిష్టమైన వైద్య సేవలు అవసరమై, పేదరికంతో ఇబ్బందిపడుతున్న వారికి ఆర్థిక సహకారం అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

తెనాలి అర్బన్: తెనాలి మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు కమిషనర్ బండి శేషన్న ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో జరిగే సమావేశానికి మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షతన వహిస్తారని పేర్కొన్నారు. కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, ఎక్స్ అఫీషియో సభ్యులు పాల్గొనాలని ఆయన కోరారు.

రేపు ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం

తెనాలి: పట్టణానికి చెందిన సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం నిర్వహిస్తారు. కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో ఆరోజు ఉదయం 9.30 గంటలకు ఏర్పాటయే సభకు సంఘం అధ్యక్షుడు మొవ్వా సత్యనారాయణ అధ్యక్షత వహిస్తారు. తెనాలి సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహ ముఖ్యఅతిథిగా హాజరవుతారు. సంస్థ సభ్యుల్లో 75 సంవత్సరాలు నిండిన 14 మందికి, సహస్ర పూర్ణ చంద్ర దర్శనం (83 ఏళ్ల 4 నెలలు) చేసిన తొమ్మిది మందిని ఈ వేడుకలో సత్కరిస్తారు. అధ్యక్షుడు మొవ్వా సత్యనారాయణ, కార్యదర్శి ప్రసాదం పూర్ణచంద్రరావు పర్యవేక్షిస్తారు.

గుండెజబ్బులపై అవగాహన ఉండాలి

గుంటూరు మెడికల్: వయస్సుతో సంబంధం లేకుండా గుండె జబ్బులు వస్తున్నాయని, దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ గుండె జబ్బులపై అవగాహన కలిగి ఉండాలని హోప్ విన్‌హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్, సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ షమ సుల్తానా అన్నారు. ఆదివారం వరల్డ్ హార్ట్ డే సందర్భంగా స్థానిక ఎన్జీఓ కాలనీలోని డాక్టర్ రంజన్ బాబు కార్స్ గ్రూప్‌లో ప్రథమ చికిత్సపై డాక్టర్ షమ సుల్తానా ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ఆధునిక వనశైలి వల్ల నేడు గుండెజబ్బులు బాగా పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఆర్ చేసే మానేక్విన్, మాస్కులు హాస్పిటల్ తరఫున విద్యార్థులకు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ గణేష్, కాలేజీ డైరెక్టర్ సత్యవతి పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల ఇద్దరు యువకులు ఆత్మహత్య

నగరంపాలెం: వేర్వేరు ఘటనల్లో ఇద్దరు యువకులు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాలు.. మంగళదాస్‌నగర్ రెండో వీధికి చెందిన బి.ప్రసన్న, మాణిక్యరావు(34) భార్యాభర్తలు. వీరికి కుమారుడు ఉన్నాడు. మాణిక్యరావు పెయింట్ పనులకు వెళ్లేవాడు. అతడి అమ్మ జయమ్మకు అనారోగ్యంగా ఉండటంతో ఆస్పత్రిలో చూపించాడు. అయితే తల్లికి చికిత్స నిమిత్తం సుమారు రూ.5 లక్షల వరకు అప్పు చేశారు. ఈ క్రమంలో చిలకలూరిపేటలో భార్య పేరుపై ఉన్న టిడ్కో ఇల్లు తనఖా పెట్టాలనే భార్యతో గొడవ పడ్డాడు. శనివారం రాత్రి భార్య కుటుంబ సభ్యులు వచ్చి మాణిక్యరావుతో గొడవపడ్డారు. దీంతో మనస్తాపానికి గురైన అతను ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు పాతగుంటూరు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని శవపరీక్షలు నిమిత్తం జీజీహెచ్ శవాగారానికి తరలించారు.

ఉరేసుకుని వ్యక్తి...

చున్నీతో ఉరేసుకుని ఒకరూ మృతిచెందారు. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాలు.. ఏటుకూర్ రోడ్డు దర్గా మాన్యంకు చెందిన యు.నాగేశ్వరరావు (33)తో కొల్లిపరకు చెందిన తిరుపతమ్మకు 2013 లో వివాహమైంది. వీరికి కుమార్తె ఉంది. భార్యాభర్తల మధ్య విభేదాలు వచ్చి వేర్వేరుగా ఉంటున్నారు. కూలీ పనులకు వెళ్లే నాగేశ్వరరావు శనివారం సాయంత్రం ఇంట్లోని ఫ్యాన్‌కు చున్నీ తో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భర్త మృతిపై తిరుపతమ్మ ఆదివారం లాలాపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లంక గ్రామాల్లో 'మానవత' సేవలు స్ఫూర్తిదాయకం



ఆర్థికసాయం అందించిన సభ్యులతో కొత్త సుబ్రహ్మణ్యం, రామ్‌చంద్

> రీజినల్ చైర్మన్, పారిశ్రామికవేత్త కొత్త సుబ్రహ్మణ్యం

తెనాలి: వరద బాధిత లంక గ్రామాలకు మానవత స్వచ్ఛంద సంస్థ అందించిన సాయం స్ఫూర్తిదాయకమని రీజినల్ చైర్మన్, పారిశ్రామికవేత్త కొత్త సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. కేవలం వాట్సాప్ సందేశానికి స్పందించి రూ.5 లక్షల సాయం అందించిన సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు. మానవత సర్వసభ్య సమావేశం ఆదివారం స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీ లైబ్రరీ హాలులో నిర్వహించారు. తెనాలి చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ అధ్యక్షత వహించారు. కొత్త సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సభ్యత్వం వెయ్యికి పైగా చేరేలా ముందుకు వెళదామని చెప్పారు. మానవత సంస్థకు కమ్యూనిటీ హాలు ఏర్పాటుకు, మహిళా సాధికారత కోసం ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించాలని సూచించారు. డాక్టర్ రామ్‌చంద్ మాట్లాడుతూ తెనాలి, వేమూరు నియోజకవర్గాల్లోని కృష్ణా తీరంలోని 12 లంక గ్రామాలకు చెందిన 950 బాధిత కుటుంబాలకు రూ.700 చొప్పున నిత్యావరాల కిట్‌ను, మరో 500 కుటుంబాలకు పొద్దుటూరు శాఖ సమకూర్చిన దుప్పట్లతో టవల్‌ను కలిపి పంపిణీ చేసినట్టు డాక్టర్ రామ్‌చంద్ వెల్లడించారు. ఆర్థికసాయం అందించిన సభ్యులకు జ్ఞాపికలను బహూకరించారు. డాక్టర్ భీమవరపు సాంబిరెడ్డి మాట్లాడుతూ సంస్థ తరపున ఆరోగ్య శిబిరాల నిర్వహణను సూచించారు. ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ ఓంకార్ ప్రసాద్ ప్రతి ఒక్కరూ మరొకరిని సభ్యుడిని చేర్పించాలని కోరారు. గుంటూరుకు చెందిన అమ్మ చారిటబుల్ ట్రస్ట్ హెచ్ఐవీ బాధిత చిన్నారులకు నెలనెలా అందిస్తున్న పౌష్టికాహార వితరణలో పాలుపంచుకోవాలని ట్రస్ట్‌కు చెందిన రమేష్, కుర్రా శ్రీను విజ్ఞప్తిచేశారు. ఇంటర్మీడియట్ విద్యార్థిని తుళ్లూరి తేజస్వినికి కూరపాటి రవీంద్రనాథ్, కళ్యాణి దంపతులు రూ.10 వేల ఆర్థికసాయాన్ని ఆమె తల్లికి అందజేశారు. డిగ్రీ సెకండియర్ విద్యార్థి వలవరపు జనార్ధనరావుకు రూ.12 వేలను సంస్థ తరపున అన్నాబత్తుని శ్రీధర్ అందజేశారు. సమావేశంలో పి.వెంకట్, ముత్తేవి రవీంద్రనాథ్, పరిమి వాసు, డీవీ సోమయ్యశాస్త్రి, ఎస్‌వీ శర్మ, మొవ్వా సత్యనారాయణ, వెంపటి సత్యనారాయణ, రోహిణి పాల్గొన్నారు.

శారద సర్వీస్ సొసైటీ వైద్య శిబిరానికి స్పందన



రోగులతో డాక్టర్ శారద

తెనాలి: పట్టణానికి చెందిన స్వచ్ఛంద సేవాసంస్థ డీ3 శారద సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకురాలు డాక్టర్ డి.శారద ఆధ్వర్యంలో ప్రతినెలా నిర్వహిస్తున్నట్టే చివరి ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. బుర్రిపాలెం రోడ్డులోని డాక్టర్ ఎస్ భవనంలో ఏర్పాటుచేసిన శిబిరానికి వివిధ గ్రామాల్నుంచి రోగులు పెద్దసంఖ్యలో వచ్చారు. వారికి అల్పాహారం అందించి షుగరు, బీపీ, బీఎంఐ పరీక్షలను చేశారు. అవసరమైనవారికి ఈసీజీ, ఫిజియోథెరపీ పరీక్షలు నిర్వహించారు. నెల రోజులకు సరిపడా బీపీ, షుగర్, కాల్షియం, బలం బిళ్లలను అందజేశారు. జీవనశైలి వ్యాధుల బారిన పడకుండా ఉండటానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రతిరోజూ వ్యాయామం, సమతుల ఆహారం, బరువు తగ్గేందుకు పాటించాల్సిన జాగ్రత్తలపై డాక్టర్ శారద అవగాహన కల్పించారు. 200 మందిపైగా పాల్గొన్న శిబిరంలో 20 మంది సంస్థ వలంటీర్లు సేవల్ని అందించారు.

వరద బాధితులకు ఆపన్న హస్తం



పెదలంక మధ్యగూడెంలో బాధిత కుటుంబాలకు కిట్లు అందజేస్తున్న దాతలు



రావిలంకలో నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

పెదలంక(భట్టిప్రోలు)/కొల్లూరు/రేపల్లెరూరల్: వరద బాధితులకు దాతలు చేయూతనందిస్తున్నారు. నిలువ నీడ కోల్పోయిన నిరాశ్రయులకు అండగా నిలుస్తున్నారు. భట్టిప్రోలు మండలం పెదలంక మధ్యగూడెం గ్రామానికి చెందిన వివిధ హోదాల్లో ఉన్న పలువురు ఆదివారం 300 మంది వరద బాధిత కుటుంబాలకు రూ. 3 లక్షలు వ్యయం చేసే నిత్యావసర వస్తువులు, దుప్పట్లు, దుస్తుల కిట్లు అందజేశారు.

■ మండలంలోని పోతార్లంక శివారు రావిలంకకు చెందిన వరద పీడిత కుటుంబాలకు ఆదివారం ఎన్ఆర్ఐ దేవరపల్లి అగ్గిరామయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. మేడ్ రాష్ట్ర అధ్యక్షుడు మురికిపూడి దేవపాల్ సారథ్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రూ.వెయ్యి విలువైన నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో తోకలవారిపాలెం సర్పంచి టి.కృష్ణమోహన్, మేడ్ నాయకులు గోడుగు సూరిబాబు, సొపాటి కిరణ్ బాబు, రావెల నల్లయ్య, కట్టిపోగు పున్నారావు, సుమంత్, ప్రజా సంఘాల నాయకుడు పి. నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

■ అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, మధ్యాహ్న భోజనం వర్కర్లు, యానిమేటర్లు, పంచాయతీ కార్మికులకు సీఐటీయూ ఆధ్వర్యంలో వరద బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఆదివారం కొల్లూరులోని సీఐటీయూ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో సుమారు 200 కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ. 800 విలువైన నిత్యావసర సరుకులు, దుస్తులు పంపిణీ చేసినట్లు సీఐటీయు రాష్ట్ర కార్యదర్శి కె. ధనలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు ఆర్‌వీ. నరసింహారావు, రమాదేవి, గీత, సీహెచ్. మజుందార్. కె. ఝూన్సీ, వెంకటేశ్వరమ్మ, ప్రజా సంఘాల నాయకులు టి. కృష్ణమోహన్, బి. అగస్టీన్, టి. సురేష్, జి. సుధాకర్, బి. సుబ్బారావు, పి. నాగమల్లేశ్వరరావు, కృపానందం, దివ్య తదితరులు పాల్గొన్నారు.

■ రేపల్లె మండలం పెనుమూడి గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ, ఆశ, అసంఘటిత రంగంలోని ముఠా కార్మికులు 40 కుటుంబాలకు ఒక్కొక్కకీ రూ.800 విలువ చేసే నిత్యావసర వస్తువులు, దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.ధనలక్ష్మి, జిల్లా అధ్యక్షుడు మణిలాల్, భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్‌వీ నరసింహారావు, రమాదేవి, గీత, మంజుదార్, ఝూన్సీ, ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

'నవరసాల నటుడు నందమూరి' శతక పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరించిన మాజీమంత్రి ఆలపాటి

తెనాలి: బెంగళూరులోని సీపీ బ్రౌన్ సేవా సంస్థ నిర్వహించిన విశ్వ శతక స్పర్ధలో తృతీయ బహుమతిని అందుకున్న 'నవరసాల నటుడు నందమూరి' శతక పుస్తకాన్ని ఆదివారం సాయంత్రం తెనాలిలో ఆవిష్కరించారు. స్థానిక కొత్తపేటలోని కాకతీయ కో–ఆపరేటివ్ బ్యాంక్‌లో డీఎల్ కాంతారావు సమావేశపు వేదికపై జరిగిన సభకు సాంఘిక సంక్షేమ గురుకులాల విశ్రాంత ప్రిన్సిపాల్ జి.రాజశేఖర్ అధ్యక్షత వహించారు. విశ్రాంత తెలుగు అధ్యాపకుడు రాయప్రోలు జగదీశచంద్రశర్మ రచించిన శతక పుస్తకాన్ని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విశ్వవిఖ్యాత నటసార్వభౌమగా గుర్తింపును పొందిన ఎన్టీరామారావును స్మరించుకున్నారు. తెనాలిలో ఎన్టీరామారావు శతజయంతి ఉత్సవాలను ఏడాది నిర్వహించినట్టు గుర్తు చేశారు. తన సినిమాలతో ఎన్టీఆర్ చిరంజీవిగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజల హృదయాల్లో ఉంటారని చెప్పారు. ప్రముఖ సాహిత్యకారుడు బీరం సుందరరావు పుస్తక సమీక్ష చేశారు. చైతన్య వేదిక అధ్యక్షుడు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి, ప్రముఖ కవి నగ్నముని, రచయిత పాలడుగు ఆనందయ్య, కాకతీయ కో–ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ డీఎల్ కాంతారావు, రామరాజు కేశవరావు ప్రసంగించారు.

ఆంధ్రదేశాన్ని ఉర్రూతలూగించిన

శతాధిక నాటకకర్త కొడాలి గోపాలరావు



గ్రామగ్రామాన ఆడిన నాటకాలివి

> అక్టోబరు 1న శతజయంతి సందర్భంగా....

తెనాలి: జనవరి 14, 1959..చెన్నైలోని వాణీమహల్..'దొంగవీరడు' నాటక ప్రదర్శన.ముందు వరసల్లో సినీరంగ అతిరథ మహారథులున్నారు. ప్రదర్శన ఆరంభమైన కొద్దిసేపట్లోనే అంతా లీనమైపోయారు. నాటకం పూర్తవగానే కరతాళధ్వనులు. ప్రేక్షకుల్లోంచి ప్రముఖ నటుడు గోవిందరాజుల సుబ్బారావు వేదికపైగా వచ్చారు. 'ఇప్పుడు మీరంతా చూసిన నాటకం ప్రదర్శించింది మా తెనాలివారు. స్త్రీ పాత్ర లేకుండా, పాట, పద్యం వినిపించకుండా రెండున్నర గంటలసేపు అద్భుతంగా సాగిన ఈ నాటకాన్ని మీరు ఆడి రక్తికట్టించగలరా?' అంటూ ప్రశ్నించారు. తెనాలి కళా వైభవానికి ఇదొక మచ్చుతునక. 'దొంగవీరడు' నాటకాన్ని తెనాలికి చెందిన కొడాలి గోపాలరావు రచించారు. తెలుగు నాటక రంగంలో గల ఇద్దరు శత నాటకకర్తల్లో గోపాలరావు ఒకరు. ఆయన కలం నుంచి ఊపిరిపోసుకున్న వందకు పైగా నాటకాలు గ్రామీణ జీవితానికి చెందినవే. అవన్నీ నాటిరోజుల్లో ఆంధ్రదేశంలోని ప్రేక్షకుల్ని ఉర్రూతలూగించాయి.

పురుడు పోసుకున్న పలు నాటకాలు

అధికారం తెచ్చే అతిశయాలు, సగటు మనుషుల స్వార్థం, స్త్రీల అవస్థలు, పేదల పాట్లు, బడుగువర్గాల ఆక్రందనలు గోపాలరావు నాటకాల్లో ప్రాణం పోసుకున్నాయి. అవినీతి, ఆకలి బాధల నుంచి ఆయన పాత్రలు ప్రభవించాయి. దుర్భర దారిద్ర్యం, రైతు కూలీల్ని కామందులు దోపిడీ చేయడం, వరకట్నం, అధిక ధరల ఇతివృత్తాలతో ఆయన నాటకరచన సాగింది. మంటల్లా రగిలే సంభాషణలు, వేదికపై చకచకా సాగే సన్నివేశాలు నాటక శిల్పాన్ని రక్తికట్టించాయి. ఆయన నాటకాల్లో రైతులు, నిరుద్యోగులు, అబలలు కొత్త గొంతు వినిపించారు. గోపాలరావు రచించిన పేద రైతు, లంకెలబిందెలు, చైర్మన్, దొంగవీరడు నాటకాలు ఆంధ్రదేశంలో ప్రతి గ్రామంలోనూ ప్రదర్శించారు. ప్రజానాట్యమండలి ముమ్మరంగా ఆడుతున్న మాభూమి నాటకంపై ప్రభుత్వం నిషేధంతో, ఆ నాటకానికి దగ్గరగా ఉన్న గోపాలరావు పేదరైతు నాటకాన్ని తీసుకున్నారు. తెలుగు సాంఘిక నాటక రంగంలో డజను సార్లు పునర్ముద్రణ పొందిన నాటకం బహుశా అదే. పరిషత్‌ల యుగం రావడంతో నాటక సమాజాలు గోపాలరావు మరో రచన 'దొంగవీరడు' నాటకాన్ని అందుకున్నాయి. ఆయన రకరకాల ఇతివృత్తాలతో ఎన్నో నాటకాలు, నాటికలు, ఏకపాత్రలను రాశారు. చారిత్రాత్మక, జానపద, డిటెక్టివ్ నాటకాలనూ వెలువరించారు. అన్నీ బహుళ ప్రజాదరణ పొందాయి. నాటక రచనలో ఎంత నిష్ణాతులంటే ఏదైనా సమాజం వారొచ్చి, ఫలానా సబ్జెక్టుపై నాటకం కావాలని అడిగితే నాలుగైదు రోజుల్లో రాసిచ్చేవారు. 24 గంటల్లో నాటిక రాసిన సందర్భమూ ఉంది. అందుకే ఆయన శతాధిక నాటక కర్త మాత్రమే కాదు..అర్జంటు నాటక రచయిత కూడా!

కళ కళ కోసం కాదు... ప్రజల కోసం



కొడాలి గోపాలరావు

తెనాలి సమీపంలోని పెదరావూరులోని మధ్యతరగతి రైతుకుటుంబంలో 1925 అక్టోబరు ఒకటిన గోపాలరావు జన్మించారు. చదివింది మూడో తరగతి. పత్రికలూ, లైబ్రరీ పుస్తకాలతోపాటు వ్యక్తులనూ, సమాజాన్ని చదవటం, ఆయన్ను తిరుగులేని రచయితగా నిలబెట్టింది. 'కళ కళ కోసం కాదు... ప్రజల కోసం' నినాదంపై ప్రజాసమస్యలు ఇతివృత్తంగా రచయితలు నాటకాలు తీసుకొస్తున్న 1940–50 నాటి కాలం అది. ఆ రోజుల్లో కలం పట్టిన గోపాలరావు అమూల్యమైన నాటకాలను రాయ సాగారు. దగా, మోసం, దుర్నీతి తాండవిస్తున్న రోజుల్లో ప్రజల ఆశలు అడియాసలుగా మారాయి. రైతు సమస్యలపై రచనలు చేస్తు న్న గోపాలరావుపై ఈ ప్రభావం పడింది. గాడితప్పిన బతుకులు, జీవితాలు ఆయనకు శాంతి లేకుండా చేశాయి. ఆ అశాంతి నుంచి ఒక సుదీర్ఘ నాటకయాత్ర ఆరంభమైంది.

పలు సినిమాలకు సంభాషణలు

గోపాలరావు భార్య సుజాతమ్మకు సినీ నటుడు కొంగర జగ్గయ్య బంధువు. ఆయన ఆహ్వానంతో 1961లో చెన్నై వెళ్లారు. ఎన్టీఆర్, జమునల 'పల్నాటి యుద్ధం' , అక్కినేని, వహీదాల 'బంగారు కలలు'కు మాటలు రాశారు. 'శభాష్ ఇన్‌స్పెక్టర్', 'పగ' సినిమాలను సొంతంగా తెలుగులోకి డబ్ చేశాడు. 'కల చెదిరింది' సినిమాను సొంతంగా తీశారు. మరి కొన్ని సినిమాలు మధ్యలోనే ఆగిపోయాయి. ఆర్థికంగా నష్టపోయిన గోపాలరావు, తనను 'గురువుగారూ' అని పిలిచే సూపర్‌స్టార్ కృష్ణ వద్ద రచనా విభాగంలో నెల జీతంతో జీవించారు. 1977లో హైదరాబాద్ చేరారు. ఏలూరు ప్రాంతంలోని పల్లెటూళ్లో 119 ఎకరాల భూమి కొన్నారు. 'కళ్యాణ కనకదుర్గ చారిటబుల్ ట్రస్ట్'ను స్థాపించారు. ఆసుపత్రి, మెడికల్ కాలేజీ సహా వివిధ నిర్మాణాలు చేయాలని భావించారు. ఆ పనులపై 1993 మార్చిలో రూ.2.50 లక్షలతో ఏలూరు వెళ్లిన గోపాలరావును ప్రాణం లేని స్థితిలో అదే నెల 8న కొందరు అపరిచితులు హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. వళ్లంతా గాయాలుండటాన్ని గమనించారు. శవాన్ని తెచ్చినవారు వెళ్లిపోయారు. ఏమీ చేయలేక కుటుంబసభ్యులు మౌనంగా అంత్యక్రియలు పూర్తి చేశారు. శత నాటకకర్తగా, గ్రామీణ నాటక రచయితగా తెలుగు నాటకాన్ని సుసంపన్నం చేసిన గోపాలరావు అస్తమయం ఒక విషాదంగా ముగిసింది.

ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్‌కు ప్రోత్సాహక నగదు బహుమతులు





కండక్టర్ వెంకటేశ్వరమ్మ, డ్రైవర్ నారాయణకు ప్రోత్సాహక నగదును అందజేస్తున్న డీఎం రాజశేఖర్, చింపయ్య, రేణుకయ్య

తెనాలి రూరల్: ప్రయాణికులకు మెరుగైన సేవలందిస్తున్న తెనాలి ఆర్టీసీ డిపోకు చెందిన కండక్టర్, డ్రైవర్లకు విశ్రాంత ప్రధానోపాధ్యాయులు అభినందించి ప్రోత్సాహక నగదు బహుమతుల్ని అందజేశారు. తెనాలి నుంచి భట్టిప్రోలు వెళ్లే ఆర్టీసీ బస్సులో పని చేస్తున్న కండక్టర్ డి. వెంకటేశ్వరమ్మ ప్రయాణికులతో మమేకమై చక్కగా పలకరిస్తూ విధులు నిర్వహిస్తున్నారు. డ్రైవర్ వి.వి. నారాయణ ఈ మార్గంలో బస్సును ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా నడుపుతున్నారు. వీరి సేవలకు విశ్రాంత ప్రధానోపాధ్యాయులు వై. చింపయ్య, జి. రేణుకయ్య ముగ్ధులయ్యారు. ఆదివారం తెనాలి ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లిన వీరు డిపో మేనేజర్ రాజశేఖర్ సమక్షంలో వెంకటేశ్వరమ్మ, నారాయణలను అభినందించారు. డీఎం చేతులమీదుగా ఇద్దరికీ రూ. వెయ్యి చొప్పున ప్రోత్సాహక నగదు బహుమతుల్ని అందించారు. తమ సేవల్ని గుర్తించినందుకు డిపో సిబ్బంది చింపయ్య, రేణుకయ్యలకు కృతజ్ఞతలు తెలిపారు.